12

# చెమ్మగిల్లిన కళ్ళు

రమణయ్యకి ఒళ్ళు మండిపోతోంది. డబ్బుకి అతనికి విడదియ్యలేని లంకె. ఎవ్వరికీ ఒక్క రూపాయి అప్పుగా కూడా ఇవ్వడు. అలాంటిది మొన్నోరోజు గవర్రాజు వచ్చి ఓ వెయ్యిరూపాయలు కావాలి... చాలా అరిజెంటు... పీకల మీదికొచ్చింది. రెండు మూడు రోజుల్లో మీ డబ్బు మీకిచ్చేస్తానంటూ మరీ మరీ బతిమాలితే ఎలా ఇచ్చాడోగానీ ఇచ్చేశాడు. రెండు మూడు రోజులు కాదు కదా పది పన్నెండు రోజులై పోయింది. సొమ్మూ లేదు... మనిషీ అయిపులేదు. వాళ్ళింటికి పోయి అడిగితే ఆ ముసలి తల్లి వణికిపోతూ చేతులు జోడించింది.

“తెలియదయ్యా... ఏదో ఊరికి పోతున్నానన్నాడు... పనెప్పుడైతే అప్పుడు వస్తానన్నాడు...” ఇంక అంతకంటే ఒక్కమాట ఎక్కువ మాట్లాడకుండా తలదించుకుంది. పళ్ళు నూరుకుంటూ ఇంటిదారి పట్టాడు చేసేదిలేక. దోవలో ఎదురు పడిన భద్రాచలాన్ని అడిగాడు. “గవర్రాజు నీ స్నేహితుడేగా?”

“ఔనయ్యా”.

“ఏవయ్యాడు వాడు?”

“ఏవవుతాడండీ?” అమాయకంగా అడిగాడు.

“ఆ... ఎత్తి కుదేస్తే ఏడవుతాడు. మరీ అంత అమాయకంగా మాటాడకు. ఎక్కడికి పోయాడు వాడు... కనిపించట్లేదు పది రోజులుగా...”

“నాకూ తెలియదయ్యా...”

కొరకొరా వాడివంక చూసి విసుక్కుంటూ విసవిసా ఇల్లు చేరాడు రవణయ్య. భార్యపోయి ఎనిమిదేళ్ళయింది రవణయ్యకి. కొడుకు గోవిందుకి అప్పుడు పదేళ్ళ వయసు. డబ్బే ప్రాణంగా బతికే రవణయ్యకి ఆనాటినుంచీ కొడుక్కూడా ప్రాణం అయ్యాడు. డబ్బుకి లోటు లేదు. ఉన్న ఊళ్ళో పొలాలు... ఉన్నదొక్కడే సంతానం. కాలేజి చదువులకోసం కొడుకుని పట్నంలో పెట్టక తప్పలేదు. ఇంకో అబ్బాయితో కలిసి గది అద్దెకి తీసుకుని ఉంటున్నాడు గోవిందు. నాలుగైదు నెలల కిందట రవణయ్యకి గుండెల్లో నెప్పొస్తే పట్నం తీసుకొచ్చి వైద్యం చేయించాడు గోవిందు. అప్పట్నించీ తనకేదైనా అనారోగ్యం వచ్చినా తండ్రికి చెప్పి కంగారు పెట్టేవాడు కాదు. తన గురించి బెంగతో దిగులుతో ఆయనకి మళ్ళీ ఎక్కడ గుండెల్లో నెప్పి వస్తుందోనన్న భయం. అసలే ఆ మనిషికి ఆదుర్దా ఆందోళనా ఎక్కువ.

✧ ✧ ✧

మర్నాడు పొద్దున్నే మరో పనిలేనట్టు మళ్ళీ గవర్రాజు ఇంటివైపు వెళ్ళాడు రవణయ్య. "వచ్చాడా నీ కొడుకు?" గద్దించి అడిగాడు.

"ఇంకా రాలేదయ్యా" బితుకు బితుకు మంటూ చేతులు జోడించింది ఆ తల్లి.

"వెయ్యి రూపాయలు పుచ్చుకుని నిన్నూ ఈ ఊరినీ కూడా వదిలిపెట్టి పారిపోయాడన్నమాట. ఊళ్ళో ఇంకెంతమంది దగ్గర ఎంత కొట్టేశాడో? కళ్ళముందు పుట్టి పెరిగినవాడిని కూడా నమ్మడానికి లేకుండా ఉంది". గవర్రాజుతో పాటూ వాడి తల్లిని కూడా నాలుగు మాటలనేసి అక్కడినించి కదిలాడు. ఇంటికొచ్చేసరికి వంటమనిషి సుందరం అందిస్తున్న మంచినీళ్ళ గ్లాసు అందుకుంటూ కనిపించాడు గోవిందు. "ఇదేమిట్రోయ్! సెలవలిచ్చారా ఇప్పుడు? అకస్మాత్తుగా దిగావు... అలా నీరసంగా అయిపోయావేంటి. తిండి తినడం లేదా అసలు?" ప్రశ్నల మీద ప్రశ్నలు గుప్పిస్తున్నాడు గానీ... కొడుకుని చూసిన సంతోషం మొహంలో కొట్టొచ్చినట్టు కనపడుతోంది. అప్పుడు చూశాడు సూట్‌కేసు, మరో సంచీ గోడవారగా పెడుతున్న గవర్రాజుని. కోపం కట్టలు తెంచుకుంది. "ఏం నాయనా! డబ్బు తీసుకునేటప్పుడున్న బుద్ధి తిరిగి ఇవ్వడానికుండదా? ఊరే విడిచి వెళ్ళిపోయావు. ఇప్పుడెందుకొచ్చినట్టూ? నీలాంటి

వాడిని నమ్మడం నాదే పొరపాటు. ఒరే! గోవిందూ ఈ గవర్రాజుతో స్నేహం మానుకోవాలి నువ్వు... వెయ్యి రూపాయలు...” తండ్రిని మాట పూర్తి చెయ్యనివ్వకుండా మధ్యలో అడ్డుకున్నాడు గోవిందు.

“నాన్నా! అర్జెంటుగా వెయ్యి రూపాయలు తీసుకుని నా దగ్గరకి రమ్మని నేనే కబురు చేశాను గవర్రాజుకి. స్నేహితుడి బండిమీద వెళ్తుంటే పడిపోయాను. దెబ్బలు తగిలాయి బాగా...” అంటూనే రెండు కాళ్ళమీదా ప్యాంటు పైకి మడిచి చూపించాడు.

“అమ్మో... అమ్మో...” గుండెలు బాదుకున్నాడు రవణయ్య.

“చాలా మటుకు తగ్గిపోయాక ఇప్పుడు చూసే ఇంత బెంబేలు పడుతున్నావు... అప్పుడు చూస్తే కంగారు... మానసికంగా నీకు ఒత్తిడి అయ్యి... నీ ఆరోగ్యం మళ్ళీ దెబ్బ తింటుందేమోనన్న భయంతో ఈ విషయం నీకు చెప్పద్దని... నాక్కాస్త నెమ్మదించే దాకా నా దగ్గర ఉండేలా రమ్మని కబురు పెట్టాను గవర్రాజుకి. వీడు నాకు చేసిన సేవకి ఏమిచ్చినా ఋణం తీర్చుకోలేం” మనస్ఫూర్తిగా అన్నాడు గోవిందు.

“ఈ విషయం మీ అమ్మకి తెలుసా గవర్రాజూ?”

“అమ్మకి చెప్పకపోతే నేనేమైపోయానో అని ఏడవదా? ఎవరికీ చెప్పకూడదన్నాను... ముఖ్యంగా మీకు...”

రవణయ్య కళ్ళు చెమ్మగిల్లాయి. గవర్రాజు భుజమ్మీద చెయ్యి వేసి దగ్గరకి తీసుకున్నాడు.

“పద... ముందు మీ అమ్మని మన్నించమని అడగాలి నేను...”

ఆశ్చర్యంగా చూశాడు గవర్రాజు. ఆయన మాటల్లోని ఆత్మీయతకి అతడి కళ్ళూ మెరిశాయి తడి తడిగా.

మినీ కథా సౌరభం